# వుడ్డుయాపిల్ రోడ్డు

శ్రీ జి. జోగారావు. బి.యె

పెదవులకు రంగురాసుకొని గులాబీ బుగ్గలతో ముస్తాబై అందచందాలు వొలికించే అమ్మాయి యెవరైనా మీకు సమావేశపడితే......

మొదటినుంచీ కథ ప్రారంభిద్దాము.

ధనవంతురాలైన మా అత్త వొకర్తె విధిలేక యీ ప్రపంచాన్ని వదలిపెట్టింది. దానితో మరో అయిదువేల రూపాయిలతో నా సంపద హెచ్చింది. కొత్తగా వచ్చిన యీ సొమ్ము వసూలుకోసము నేను స్వయముగా పట్నం బయలుదేరాను. లాయరుతో కొంతసేపు ముచ్చటించాక బ్యాంకు కౌంటరు దగ్గర చాలవరకు నిలబడి ఏభై సరికొత్త నూరురూపాయిల నోట్లు నా కోటులోపలి జేబులో జాగ్రత్తచేసి మెయిను రోడ్డుమీద కాలుపెట్టాను. ఆ ఉదయం వాతావరణ పరిస్థితి బాగుంది. ఉదయభానుని వెలుగనీడల్లో నగరము యెంతో మనోహరంగా అగుపడుతూంది. నామట్టుకు నాకు భూమిమీంచి యెగిరిపోతున్నట్టు అగుపించింది కాని నా కాళ్ళు నన్ను తీసుకుపోతున్నట్టు తోచలేదు.

ఆరూపాయిలు యేదేనా వ్యాపారములో పెడదాం. ఒక సంవత్సరం లేక ఆ దరిదాపు కాలంలో అవి యేభై వేలు అవుతాయి. మరికొన్ని సంవత్సరాలలో ఆయిదులక్షలు ... కాకపోతే యేభై లక్షలు—అప్పుడు యే బ్రదర్సులాగో...కాని నాకు అన్నదమ్ములులేక ... పోనీ...'ఎ...అండు సన్సు' లాగా...కాని నాకు కుమారుడులేడు...భార్యాయే లేదు. అవును. నాకు ముఖ్యంగా భార్య వుండాలి. విద్యావతి, సౌందర్యవతి, సంస్కారము కలిగి వుండాలి. నాయీ ఆలోచన యెవరో పిలవటం మూలాన్ని చెరయింది. నేను చుట్టుతిరిగి చూచేను. బాగా ముస్తాబైన వొక అమ్మాయి అందాలు చిందుతూ ప్రక్కని నిలుచునుంది.

'వుడ్డు ఆపిల్ రోడ్డుకు దారి తెలుపుతారా?'

వుడ్డు ఆపిల్ రోడ్డు! భగవంతుడా! ఎక్కడుంది అది? ఆపట్నం రావటం నాకు అదే తొలిసారి. వుడ్డుఆపిల్ రోడ్డు ఆ మహానగరానికి వుత్తరాన్నేవుందో, దక్షిణాన్నేవుందో — తూర్పునే వుందో, పడమటనేవుందో నాకు తెలీదు. నిజానికి ఆ నగరము గురించి నా తెలిసినంతవరకు అలాంటి వీధి వుందని నాకు తెలీదు. కాని నా తెలియకపోవటాన్ని ప్రకటించడమేనా?

ఆమె తిరిగీ అడిగింది. నేను వొకవిధంగా నాకు తెలీకుండానే పైకిఅన్నాను.

'వుడ్డు ఆపిల్ రోడ్డు..అవును. అసలు ఆదారినే నేను యిపుడు వెళ్ళబోతున్నాను.'

ఆమాటలు అనీఅనడంతో వాటిఅర్థము నాకు స్ఫురించింది.. కాని అప్పటికే మించిపోయింది.

'అమ్మాయి! నేను అబద్ధము చెప్పినందుకు విచారిస్తున్నాను. నేను యీనగరానికి కొత్తవాణ్ణి. వుడ్డు ఆపిల్ రోడ్డు గురించి నాకు తెలియదు.' అని చెప్పవలసివస్తే అంతకంటె బుద్ధిహీనత మరొకటి వుండదు. నాలో యీఆలోచనలు తెగలేదు. అలాగే ఆఅమ్మాయి నాప్రక్కనే వస్తూంటే నడుస్తున్నాను.

'చాలాదూరమా?' ఆమె అడిగింది.

'అవును...అంటే యెంతో దూరముకాదు.' అని అస్పష్టంగా నేను యేదో సణిగేను.

'కాని...యేదో పార్కు ప్రక్కనుంచి కొంచెముసేపు నడిస్తే అక్కడకు చేరవచ్చునని నేను అనుకున్నాను.' ఆమెఅంది.

'అవును...నిజమే...ఆ రోడ్డు దగ్గరగానో పార్కువుంది.' నేను అన్నాను.

'కాని యిప్పుడే కొన్ని అడుగులు వెనుక నొక పార్కుదాటేమే.' ఆమె తిరిగిఅంది.

'ఈనగరమునిండా అన్ని పార్కులూ అంతా పెద్దమనుష్యులూను—' అన్నాను యేమిఅనటానికి తోచక.

ఇద్దరమూ బిగ్గరగా నవ్వుకున్నాము. నాకు కొంచెము సర్దుకోవడానికి అవకాశము వచ్చింది. ఆమె నన్ను విపరీతమయిన ప్రశ్నలు వేయకుండా సంభాషణలో పెడితే బాగుంటుందని ఆలోచన తోచింది.

ఆతర్వాత నేను వదలకుండా సంభాషణ సాగించేను. దానివల్ల తెలిసినవిషయం. ఆమె బి. యే. క్లాసులో చదువుతూంది. ప్రపంచం గురించి తెలిసికోడానికి యీప్రయాణము చేస్తూంది. ఆమె పూర్వపు సహాధ్యాయురాలిని యిపుడు కలిసికోడానికి బయలుదేరింది.

'మీది యీవూరేనా ?' ఆఅమ్మాయి ప్రశ్న

'కాదు...అవును...అంటే పట్నంకాదు.'

'అయితే పట్నానికి కొంచెము దూరంలో వుంటున్నారా ?'

నేను సమాధానము చెప్పలేదు.

మేము పెద్దబజారులో ప్రవేశించాము. అక్కడ కలిసే రోడ్లలో యేది వుడ్డు ఆపిల్ రోడ్డుకు తీసుకుపోతుందో నాకు తెలీదు. ఎవరినేనా అడిగి తెలుసుకోవాలంటే అది తలవరానిది. ఏమంటే నాకు తెలియదన్న విషయం ప్రకటితమయిపోతుంది. ఆమెతో ప్రయాణము చేయడంలోవున్న ఆనందానికి దూరమైపోతాము. ఏలాగ దాన్ని సాధించడం అనీ నా మెదడుకు యెంతపనికల్పించినా యేమి ఆలోచన తేలలేదు. ఎంతకొడితేమాత్రము చనిపోయిన గుర్రము లేస్తుంది. అలాగే నా మెదడూను.

'ఈదగ్గరలో నొక గ్లాసు మంచినీరు దొరుకుతుందా ?' ఆమె అడిగింది.

దానితో నాకోఆలోచన తట్టింది. ఆమెను ఆదగ్గరలోవున్న కేఫ్‌లోకి తీసుకువెళ్ళాను. రెండు 'ఆయిసుక్రీములు' రెండు 'కూలుడ్రింక్సు' తెమ్మని బాయ్‌కి ఆజ్ఞచేసాను. ఆమెవద్దంది. కాని బలవంతముచేయగా తీసుకుంది. 'ఒక్కనిముసం —' అంటూ నేను బయటపడ్డాను. 'వుడ్డు ఆపిల్ రోడ్డుకు దారి అడగటానికి నాకు మొదట్లో యెదుటపడిన

సంఘంలో శతాబ్దాలతరబడి వేళ్లు పాతుకుపోయిన ఒక దురాచారాన్ని అన్ని దృక్పథాలలోను చర్చించే ఒక అపూర్వమైన చిన్న గ్రంథం.

# పెళ్లికట్నం

'రాధ'

విడిప్రతి కావలసినవారు
0-4-0 స్టాంపులు పంపవలెను.

కథాంజలి ప్రచురణాలయం
32, కృష్ణప్పనాయకన్
టాంకుస్ట్రీట్ జి. టి. మదరాసు.

వాడు...అతనికి చెముడైనా అయివుండాలి లేక పుట్టుకతోనే తెలివిలేనివాడైనా అయివుండాలి... ఊరికనే నవ్వుతూ నడచిపోయాడు. అప్పుడే అక్కడ క్రాసింగులోవున్న పోలీసు జవాను నాకళ్ళ బడ్డాడు. ఎలాగో వో కలారీని...వడిగా పోతూన్న వో కారును...ఆ తర్వాత వో సార్జంటును డీకొన బోయి తప్పించుకొని కాళ్లు చేతులు విరగకుండా అతన్ని చేరుకున్నాను.

చిరునవ్వు ముఖాన్ని తోపచేసి 'వుడ్డు ఆపిల్ రోడ్‌కు దారి తెలుపుతారా?' అని నెమ్మదిగా అడిగేను.

'వుడ్డు ఆపిల్ రోడ్డు ... వుండండి ... వుడ్డు యార్డురోడ్డు కాని...షిప్పుయార్డురోడ్డు కాని కాదని మీరు నమ్మకంగా చెప్పగలరా చెప్పగలరా' అన్నాడు.

నాకు తొందర యెక్కువ అయిపోతూంది. దానితో సహనశక్తి నశించింది. అతనితో వుడ్డు యార్డురోడ్డు షిప్పుయార్డురోడ్డు గురించి నాకు తెలుసు అన్నా అప్పట్లో నాకు కావలసింది వుడ్డుఆపిల్ రోడ్డేకాని మరేదీ కాదనీ స్పష్టంగా చెప్పేను.

'సరే. వుడ్డు యాపిల్ రోడ్డు......అవును. వుడ్ యాపిల్ రోడ్ అదే...''

అప్పట్లో ప్రతిక్షణమూ యెంతో విలువ అయినది. కాని జవాను తిరిగీ ఆలోచన్లో బడ్డాడు. ఆఖరుకు అతడు మాట్లాడేడు.

''వుడ్ యాపిల్ రోడ్......అవును. తిన్నగా వెళ్ళి తర్వాత మలుపుదగ్గర కుడికేసి మరలండి. కాదుకాదు...యెడమకేసి మరలండి. తర్వాత రెండు మలుపులు. కాదుకాదు ... వుండండి ... ఒకటి...రెండు...మూడు. అవును, మూడు మలుపులు, ఎడమవైపు మరలండి. తర్వాత కుడికేసి. మీరు చేరినరోడ్డు తర్వాత రోడ్డు వుడ్డుయాపిల్ రోడ్డు...మీకు బోధపడినదా?'

అప్పటికే ఆలస్యం అయిపోయింది. అతనికి ధన్యవాదాలర్పించి నేను గబగబా కేఫ్‌లోకి పోయాను.

జవాను చెప్పిన మార్గాన్ని మేము అవలంబించేము. కాని పర్యవసానం మాత్రం ఘోరం అయిపోయింది. అరగంట నడవగా నడవగా మేము యెక్కడ బయలుదేరేమో అక్కడకే వచ్చాము.

'వుడ్డు ఆపిల్ రోడ్డు యిదిమాత్రము అయివుండదు.' అని ఆఅమ్మాయి అంది.

'ఏదైనా మలుపు మరచిపోయివుండాలి. నేను చాల విచారిస్తున్నాను.' అని గాబరాపడుతూ జవాబుచెప్పేను.

నా గాబరా ఆమె కనిపెట్టివుండవచ్చు. ఎంచేతనంటే మరుక్షణంలోనే ఆమె బిగ్గరగానవ్వింది.

'మనము భూమి గుండ్రముగా వుందని మరోసారి రుజువుజేసాము' అంది.

నేనుకూడ నవ్వటం ప్రారంభించేను. అప్పట్లోనే అదృష్టవశాత్తు మరొక పరిస్థితి తటస్థించింది. ఒక యెనుబోతు రంకెలువేస్తూ జనసమర్దముకేసి పరుగెత్తుకువస్తూంది. అందరూ తొందరతొందర అయి తలాదిక్కూ పారిపోయారు. నా పరిచయస్తురాలు కెవ్వున కేకవేసి నన్ను గట్టిగాపట్టుకుంది. ఇరువురము జనసమర్దములో పడిపోయాము.

ఆ జనసమర్దము తొలగిన తర్వాత నేను నలుదిక్కులా చూచేను. కాని ఆ అమ్మాయి అగుపడలేదు. జన సమర్దములో కలిసిపోయిందా?........లేక కాళ్లమధ్య నలిగిపోయిందో... కాక యేమిజరిగింది. నాకు భయమువేసింది. ఆమె యెక్కడుంది? మతిస్థిరముకోసం ఒకసిగరెట్టు కాలుద్దామనుకున్నాను.

కాని......కాని......నా బంగారపు సిగరెట్టుకేసు యేది...సావాచీ...యింకా వోయి భగవంతుడా!. నానోట్లకట్ట... ..

పెదవులకు రంగురాసుకొని గులాబీ బుగ్గలతో ముస్తాబై అందచందాలు వొలికించే అమ్మాయి.